గడువులోగా 'మహిళాశక్తి' పథకాలను అందించాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరా మహిళాశక్తిలో పథకాలను నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను సాధించి లబ్ధిదారులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న 12 అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సంఘాల సభ్యులు, సాధారణ పెట్టుబడి సమూహాలు, సూక్ష్మ సంస్థలు ద్వారా 7 కొత్త యూనిట్లైన బ్యూటీషియన్, మైక్ అండ్ లైటింగ్, డెకరేషన్, ఫుడ్ క్యాంటీన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్మెంట్, కన్‌స్ట్రక్షన్ యూనిట్ల టార్గెట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ యూనిట్లను కలిపి గ్రూపులుగా ఏర్పాటు చేసి గ్రూప్ టార్గెట్లను పూర్తి చేయాలన్నారు. వీటిలో ఫుడ్ క్యాంటీన్లకు స్థల సమస్య ఉన్నట్లయితే మొబైల్ ఫుడ్ కోర్టులను తీసుకోవాలన్నారు. ఆయా పనులను నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, మెప్మా పీడీ సునీల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

గణేష్ మండవ నిర్వాహకులతో డీసీపీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ పద్మజ

కుషాయిగూడ: గణేష్ ఉత్సవాల సందర్భంగా మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పోలీసులకు సహకరించాలని మల్కాజిగిరి డీసీపీ పద్మజ కోరారు. చర్లపల్లి శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో గురువారం గణేష్ మండపాల నిర్వాహకులు, భాగ్యనగర ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. అందరి సహకారంతో గణేష్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. డీజేలకు అనుమతులు లేవని, అత్యవసర పరిస్థితుల్లో 100 కాల్ చేయాలని ఆమె సూచించారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, వెంకటయ్య, నాగరాజు, శ్రీనివాస్, సందీప్, ఎస్సైలు వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీలో చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి...



రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో...

గురుభ్యోనమః

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గురువులను సన్మానం

ఆశీర్వచనాలు తీసుకున్న విద్యార్థులు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలు, మండలంలోని గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు గురువులను ఘనంగా సన్మానించారు.

– మేడ్చల్ జోన్ బృందం



అధ్యాపకులను సన్మానిస్తున్న అవుషాపూర్ వీబీఐటీ విద్యార్థులు



కీసరలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



కాచవానిసింగారం స్కూల్‌లో ఉపాధ్యాయులు



మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈలో బెస్ట్ టీచర్ అవార్డులిస్తూ...



మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో...



కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో...



జవహర్‌నగర్‌లో హెచ్‌ఎం అజామోహినుద్దీన్‌ని సత్కరిస్తూ...

'మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం'



ధర్నా చేస్తున్న మహిళా మోర్చా నాయకురాళ్లు

కీసర: కొమురం భీం జిల్లాలో గిరిజన మహిళపై లైంగిక దాడిని నిరసిస్తూ బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ చౌరస్తాలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత నాయక్, దమ్మాయిగూడ మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రశాంతి తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న ఘోరాలను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బుద్ధవరం లక్ష్మీవేణుగోపాల్, నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, మహిళా మోర్చా నాయకురాళ్లు సువర్ణ, శైలజ, వివిధ మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న పావనీజంగయ్య, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 100 మందికి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్లు రమాదేవి, నాగజ్యోతి విగ్రహాలను ప్రజలకు అందజేశారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీవాణి చందేల్, నాయకులు జంగయ్యయాదవ్, యాదగిరి, మమత శర్మ, ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర రావు, బబితారాణి, గజానంద్, బాల్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

10వ వార్డు కౌన్సిలర్ బాలగొని వెంకటేష్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ గాయత్రీ గుడి పక్కన ఎఫ్‌టీఎల్‌లో ఉన్న మిరాలకుంట చెరువును కబ్జాకు గురి చేసిన పోచారం మున్సిపల్ చైర్మన్ వి.కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఎన్.శేఖర్‌ను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని పోచారం మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ బాలగొని వెంకటేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బతుకమ్మ ఘాట్ పేరుతో సుమారు వెయ్యి నుంచి రెండు వేల గజాల వరకు చెరువులో మట్టినింపి చెరువు ఆనవాలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిరాల కుంట చెరువు కింద ఆ గ్రామ ప్రజల పంట పొలం మూడు ఎకరాల 30 గుంటలు ఉండగా అందులో 30 గుంటలను మట్టితో మూసి వేయగా చెరువు కింద ఉన్న రెండు ఎకరాల పంట పొలం కూడా మునిగిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మట్టి తీయాలని నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. ఈ విషయంపై గతంలో తాను జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. రెండు రోజుల క్రితం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే ఇరిగేషన్ ఏఈ పరమేష్ కబ్జాకు గురైన విషయంపై పోచారం కారిడార్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు మాత్రమే నమోదు చేశారని వెంటనే వారిద్దరిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్‌లో విద్యార్థుల ప్రతిభ

మల్లాపూర్: వాలీబాల్ అండర్–14, గరల్స్, బాయ్స్‌టీమ్ మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. మొదటి స్థానం కైవసం చేసుకుని ట్రోఫీని అందుకున్నారు. మేడ్చల్ జిల్లా స్థాయి లెవల్‌కు కూడా ఎంపిక కాగా.. విద్యార్థులను పాఠశాల చైర్మన్ ముత్యంరెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. పీఈటీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శం కావాలి

- ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించిన కలెక్టర్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయుల ప్రాముఖ్యత విద్యార్థులకే కాకుండా, అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటారని, విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండేలా ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మేడ్చల్–ల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

◆ గురువారం మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ గౌతమ్ జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్ననాటి నుంచి వారికి నచ్చిన ఉపాధ్యాయులను రోల్ మోడల్‌గా భావించి వారి భాష, ఆహార్యాన్ని, నడవడికను అనుసరిస్తూ ఉంటారన్నారు. అందుకే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండేలా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. గురువు ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయడానికే ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు.

◆ ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డులు కొలమానం కాదని, టీచర్లందరూ ఉత్సాహంగా విధులు నిర్వహిస్తూ పిల్లలను ఇన్‌స్పైర్ చేయాలని కలెక్టర్ సూచించారు.

◆ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ... విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్ విశిష్ట భూమికను నిర్వర్తిస్తారన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి విజయ కుమారి జిల్లా కలెక్టర్కు, అదనపు కలెక్టరుకు జ్ఞాపికను అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను మెమోంటోలతో కలెక్టర్ సత్కరించారు.

◆ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు. జిల్లాలో 46 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...

రఘునాథ్, వి.వెంకటేశ్వర్లు, డి.ఆర్.జ్యోతిరెడ్డి, వై.కృష్ణారెడ్డి, ఉమ్లానాయక్, ఎ.శ్రీదేవి, టి.మంజుల, ఆర్.వెంకటేశం, పి.నిర్మల, ఎ.ఈశ్వరాణి, డి.పద్మప్రియ, వి.శ్రీదేవి, జి.జ్యోతి, డి.చిన్నబాబు, కె.రాజేశ్వర్రావ్, రవీందర్రెడ్డి, దత్తాత్రేయరావు, ఎం.కృష్ణయ్య, ఎస్.శ్రీనివాస్, ఎన్.సుధాకర్‌రెడ్డి, ప్రసన్న కుమారి, ఎం.సునీత, ఎస్.పుష్ప, ఎన్.మాధవి. జి.జోష్న పి.మంజుల, డి.పుష్పలత, ఎ.విజయలక్ష్మి, ఎం.సంధ్యారాణి, కె.విజయలక్ష్మి, కె.ఉషాకిరణ్, సంగీత, ఎస్.మంజుల, సయ్యద్రూహి, సి.హెచ్.కొండల్, టి.కృష్ణ, ఆర్.దశిరియా, ఆర్.గణిత, పి.కృపాకర్, ఎస్.ఎల్లయ్య, కె.అనంతరెడ్డి, కె.రమాదేవి, ఎస్.అశ్విని, అబ్సివ, ఎం.కాశీరెడ్డి, ఆదినారాయణ.



హాజరైన ఉపాధ్యాయులు

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



శామీర్‌పేట పెద్దచెరువును పరిశీలిస్తున్న ఏసీపీ తదితరులు

శామీర్‌పేట్: గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. పలు శాఖల అధికారులతో కలిసి గురువారం శామీర్‌పేట పెద్దచెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... వినాయక చవితిని పురస్కరించుకొని శామీర్‌పేట మండల సమీప ప్రాంతాలతో పాటు నగరం నుంచి పెద్దత్తున వినాయక విగ్రహాల నిమజ్జనాలు శామీర్‌పేట పెద్దచెరువులో జరుగుతాయని వివరించారు. ఇందుకు అనుకూలంగా ఉండేలా ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. అనంతరం లైటింగ్, క్రేన్‌ల ఏర్పాటు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్, ఎంపీడీఓ మమతా బాయి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో నిందితుడికి ఏడాదిన్నర జైలు

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాద ఘటనలో నిందితుడికి ఏడాదిన్నర జైలు శిక్షను న్యాయస్థానం విధించింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలివీ... ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి రోడ్డు దాటుతున్న ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన ఎల్‌బీ నగర్ ఐదవ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి ఏడాదిన్నర కఠిన కారాగారా శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రైల్వే గేటు మూసివేతతో పరేషాన్



నారాయణ గార్డెన్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



అండర్ పాస్ రోడ్డు సమీపంలో ఇలా...

- ఘట్‌కేసర్‌లో వాహనదారులకు తప్పని నరకయాతన
- నత్తనను తలపిస్తున్న వంతెన నిర్మాణ పనులు
- తాత్కాలిక రోడ్డుపై అడుగు మేర గుంతలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు నత్త నడకన సాగుతున్నాయి. కరీంనగర్ రాజీవ్ రహదారి నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు రైల్వే గేటు దాటాల్సిందే. ప్రస్తుతం గేటు ముందు పిల్లర్ పనులు సాగుతుండటంతో గేటును పూర్తిగా మూసివేశారు.

◆ వాహనాల రాకపోకల కోసం నారాయణ గార్డెన్ నుంచి ఎదులాబాద్ అండర్ పాస్ రోడ్డు వరకు తాత్కాలిక రోడ్డును వినియోగిస్తున్నారు. ఆ రోడ్డుపై వాహనదారులు తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ప్రయాణించవలసిన దుస్థితి నెలకొంది. వాహనాల తాకిడి పెరిగి తాత్కాలిక రోడ్డుపై అడుగడుగునా అడుగు లోతు మేర గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ రోడ్డు కాస్తా మరింత అధ్వానంగా తయారైంది. అడపాదడప మట్టి పోస్తున్నా వర్షాలకు ఆ రోడ్డు కాస్తా మరింత బురద మయంగా మారుతుందే తప్పా సమస్యకు పరిష్కారం చూపడం లేదంటూ వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఏమరుపాటున వాహనాన్ని నడిపితే అదుపు తప్పి బురదలో పడే అవకాశముంది. ఈ గుంతల్లో వాహనాలతో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతుండటంతో గ్రామస్తులు, ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు. ప్రస్తుతం వాహనాలు వెళుతున్న రోడ్డు ఓ ప్రైవేటు వెంచర్ రోడ్డు కావడం గమనార్హం.

◆ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తిచేయనందునే తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఆదమరిస్తే ప్రణాంతకమే...

అధికారులు, ప్రజా ప్రతినిధుల అలసత్వ వైఖరే వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యానికి కారణమని వాహనదారులు, పరిసర ప్రాంతాల ప్రజలు విమర్శిస్తున్నారు. రైల్వే గేటు మూసివేతతో పట్టణంలో నుంచి వాహనాలు వెళ్లనీయకుండా చిన్నచిన్న రోడ్డుపై రాళ్లను అడ్డుపెట్టి రాకపోకలను నిలిపి వేస్తున్నారు. వంతెన పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ప్రభుత్వంతో మంజూరు చేయించాలని నాయకులను కోరినా ఫలితం దక్కడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టాలని కౌన్సిల్ తీర్మానం చేసినా నిధుల లేమితో పనులు ప్రారంభం కావడం లేదని సమాచారం. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి శాశ్వత ప్రాదిపదికన మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



మల్కాజిగిరి: బండచెరువు దిగువ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న ముంపు సమస్య పరిష్కారానికి నిపుణులతో చర్చించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం షిరిడీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతంలోని నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలా సాఫీగా కాకుండా మలుపు తిరిగి ఉండటంతో వర్షపునీరు సాఫీగా వెళ్లే అవకాశాలు తగ్గాయన్నారు. బాక్స్‌డ్రైన్స్‌తో శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. నాలాకు ఇరువైపులా నివాసాలు ఉండటం, కొన్ని కాలనీల్లో అసోసియేషన్ కోర్టుకు వెళ్లడంతో నాలా విస్తరణ పనులు కూడా సాధ్యం కాలేదన్నారు. బండచెరువు కింది ప్రాంతంలో నీరు సాఫీగా ఉండే మార్గం అన్వేషించాల్సిన అవసరముందని, దీనిని ఇంజినీరింగ్ రంగంలోని నిపుణులు, సీనియర్ అధికారులతో కలిసి చర్చిస్తానన్నారు. ఆర్పీఎఫ్ స్థలంలో నుంచి వచ్చే నీరు కూడా షిరిడీనగర్ నాలాలోకి చేరుతుండటంతో సమస్య ఎక్కువైందన్నారు. ముంపు సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభిస్తానన్నారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఏ రజనీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

బోడుప్పల్: బోడుప్పల్ బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రోడ్డు ఆక్రమణలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. 100 అడుగుల రోడ్డు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రోడ్డును ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలు, షెడ్డులను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.